7


సాక్షి విశాఖపట్నం

ఆదివారం ၊ 18 ၊ మే ၊ 2025



• చిట్టి తల్లి.. బుజ్జి కన్నా..! 8లో





న్యూస్‌రీల్

19న డిప్యూటీ మేయర్ ఎన్నికకు ఏర్పాట్లు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ డిప్యూటీ మేయర్ ఎన్నిక ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్, ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి మయూర్ అశోక్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఈ నెల 19న నిర్వహించే డిప్యూటీ మేయర్ ఎన్నికకు సంబంధించి ఎటువంటి లోపాలు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన నోటిఫికేషన్ మేరకు.. ఆ రోజు ఉదయం 11 గంటలకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించి, డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. కౌన్సిల్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఉదయం 11 గంటలకు తమ గుర్తింపు కార్డులతో సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని జేసీ సూచించారు.

మెట్రో భూసేకరణ ప్రక్రియపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: మెట్రోతోపాటు జిల్లాలో చేపట్టనున్న రైల్వే, హెచ్‌పీసీఎల్, ఇరిగేషన్, విద్యుత్, ఐఓసీఎల్, జాతీయ రహదారులు, అంతర్గత రోడ్ల విస్తరణ తదితర ప్రాజెక్టులపై కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సమీక్షించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ మీటింగ్ హాలులో జేసీ మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్‌తో ప్రత్యేకంగా సమావేశమైన ఆయన.. భవిష్యత్తు కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. డీపీఆర్‌కు అనుగుణంగా మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి తుది చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇతర ప్రాజెక్టుల కోసం నిర్దేశించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. విశాఖ, భీమిలి ఆర్డీవోలు పి.శ్రీలేఖ, సంగీత్ మాథుర్, ఎస్డీసీ సుధాసాగర్ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కార్మికుల సస్పెన్షన్ రద్దు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఇటీవల చేసిన కార్మికుల సస్పెన్షన్ రద్దు చేసింది. ఈనెల 20న తలపెట్టిన స్టీల్‌ప్లాంట్ సమ్మె సన్నాహక చర్యల్లో భాగంగా ఈనెల 13న బ్లాస్ట్‌ఫర్నేస్-1 విభాగంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. విధులు మానేసి సమావేశంలో పాల్గొన్నారంటూ అక్కడ ఉన్న కార్మికుల్లో నలుగురిని సస్పెండ్ చేయగా ఏడుగురికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ సంఘటనపై కార్మిక సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఎట్టకేలకు యాజమాన్యం శనివారం ఆ నలుగురు సస్పెన్షన్‌ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో వారు వెంటనే విధులకు హాజరయ్యారు.

జీవీఎంసీలో సోమవారం పీజీఆర్ఎస్ రద్దు

దాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 19న డిప్యూటీ మేయర్ పదవికి సంబంధించి జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఎన్నిక జరగనుంది. ఈ మేరకు పోలీసులు చేపట్టబోయే రక్షణ చర్యల్లో భాగంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మాత్రమే సోమవారం పీజీఆర్ఎస్‌ను రద్దు చేశారు. కలెక్టర్ కార్యాలయం, అన్ని జోనల్ కార్యాలయాల్లో ఆ రోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు యథావిధిగా ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

పీఎఫ్ అమౌంట్ జమ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల పీఎఫ్ అమౌంట్లలో సొమ్ము జమైంది. గత ఏడాది జూన్ నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు పీఎఫ్ ఉద్యోగులు, యాజమాన్యం వాటాలు జమ చేయలేదు. దీంతో ఉద్యోగులు ఆందోళన చెందారు. ఎట్టకేలకు యాజమాన్యం స్పందించి ఆయా అకౌంట్లలో సొమ్ము జమ చేశారు. ఆ వ్యవధికి సంబంధించి వడ్డీలు ఇంకా జమ కాలేదు. ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ నెలలో జరిగే పీఎఫ్ ట్రస్ట్ సమావేశం అనంతరం వడ్డీ జమకానుంది.

ఎంఎస్ఎంఈ ఫలితాలు విడుదల

విశాఖ విద్య: మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజస్(ఎంఎస్ఎంఈ)-2025 సెట్ ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఏయూలోని రిజిస్ట్రార్ చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో వివరాలను రిజిస్ట్రార్ ధనుంజయరావు వెల్లడించారు. ఈ నెల 11న ఏయూ పరిధిలోని రెండు కేంద్రాల్లో పరీక్షను నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం 520 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా సకాలంలో ఫలితాలు ప్రకటించామన్నారు.

ఒక్కో పోస్టుకు 43 మంది పోటీ



విశాఖ విద్య: మెగా డీఎస్సీకి దరఖాస్తు గడువు ముగిసింది. చాలా కాలం తర్వాత వెలువడిన నోటిఫికేషన్ కావడంతో ఉపాధ్యాయ పోస్టు సాధించేందుకు శిక్షణార్థులు భారీగా పోటీపడుతున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని అన్ని మేనేజ్‌మెంట్లలో 1,139 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. మొత్తం 29,779 మంది అభ్యర్థులు 49,658 దరఖాస్తులు చేసుకున్నారు. ఈ సారి డీఎస్సీకి పోటీ తీవ్రంగానే ఉండనుంది. అంటే ఒక్కో పోస్టుకు 43 మంది పోటీపడుతున్నారు. ఎలాగైనా కొలువు సాధించాలనే లక్ష్యంతో ప్రిపరేషన్‌లో ఉన్న అభ్యర్థులు అర్హతలను బట్టి ఆయా సబ్జెక్టులకు దరఖాస్తు చేసుకున్నారు.

సమయం తక్కువ.. ఒత్తిడి ఎక్కువ

డీఎస్సీ పరీక్షలు జూన్ 6 నుంచి జూలై 6 వరకు జరగనున్నాయి. మరో 20 రోజుల్లో పరీక్షను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇదే ఇప్పుడు డీఎస్సీ ప్రిపరేషన్‌లో ఉన్న అభ్యర్థులకు టెన్షన్ కలిగిస్తోంది. సమయం పెంచి, అందరికీ ఒకే రోజు పరీక్ష నిర్వహించాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నా.. ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో రేయింబవళ్లు పుస్తకాలతో అభ్యర్థులు కుస్తీ పడుతున్నారు.

భర్తీ కానున్న పోస్టులు ఇవే..

ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించి ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్ మేనేజ్‌మెంట్ పరిధిలోని పాఠశాలల్లో 734(ఓపెన్ 290 + ఇతర కేటగిరీల మొత్తం 444) పోస్టులను భర్తీ చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అదే విధంగా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలల్లో 400 పోస్టులు ప్రకటించారు. పాఠశాల విద్యాశాఖ పరిధిలోని జువనైల్ హోమ్‌లో 5 ఖాళీలు కలుపుకుని మొత్తంగా ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో 1,139 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఇవి కాకుండా జోనల్ స్థాయిలో ఏపీ రెసిడెన్షియల్/మోడల్ స్కూల్స్/సోషల్ వెల్ఫేర్/బీసీ వెల్ఫేర్/ట్రైబల్ వెల్ఫేర్(గురుకులాలు) పరిధిలోని విద్యాలయాల్లో జోనల్ ప్రాతిపదికన 400 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు.

భారీగా దరఖాస్తులు

ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాతిపదికన ఉపాధ్యాయ పోస్టుల భర్తీ జరగనుంది. ఈ నేపథ్యంలో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని పాఠశాలల్లో సబ్జెక్టుల వారీగా ఉన్న ఖాళీలు, రోస్టర్ వారీగా అందిన దరఖాస్తులు ఇలా ఉన్నాయి.

కేటగిరీ	వచ్చిన దరఖాస్తులు	కేటగిరీ	వచ్చిన దరఖాస్తులు
ఓసీ	1,626	బీసీ-ఈ	423
బీసీ-ఏ	1,940	ఎస్సీ-1	479
బీసీ-బీ	2,563	ఎస్సీ-2	876
బీసీ-సీ	198	ఎస్సీ-3	2,821
బీసీ-డీ	8,330	ఎస్టీ	10,523
		ఈడబ్ల్యూఎస్	890

వీటితో పాటు దివ్యాంగ కేటగిరీకి దరఖాస్తులు వచ్చాయి

దరఖాస్తులు ఇలా..

మొత్తం అభ్యర్థులు	29,779
సబ్జెక్టుల వారీగా దరఖాస్తులు	49,658
పురుషులు	11,773
మహిళలు	18,006

ఉపాధ్యాయుల పోరుబాట



ఐక్యత చాటుతున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు

- 21న డీఈవో కార్యాలయం ముట్టడి
- ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక సన్నద్ధత సమావేశం
- 9 రకాల బడులపై తీవ్ర వ్యతిరేకత

విశాఖ విద్య: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులలో అసంబద్ధమైన ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పోరుబాటకు సిద్ధమైంది. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 21న జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ మేరకు డాబాగార్డెన్స్ ఆర్‌బీఎం ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో శనివారం సమావేశమైన ఉపాధ్యాయ సంఘాల నాయకులు భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ అధ్యక్షుడు గోపీనాథ్, ఎస్‌టీయూ జిల్లా కార్యదర్శి ఇమంది పైడిరాజు మాట్లాడుతూ 117 జీవో రద్దు పేరుతో ప్రస్తుత ప్రభుత్వం తీసుకొచ్చిన తొమ్మిది రకాల బడులు విద్యారంగాన్ని మరింత ప్రమాదంలో నెట్టే అవకాశం ఉందన్నారు. బదిలీలు, పదోన్నతులకు సంబంధించి అసంబద్ధమైన నిర్ణయాలతో ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. సంఘాల నాయకుల అభిప్రాయాలను ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా ప్రభుత్వం ఏకపక్ష ధోరణితో వ్యవహరించడం సరైందికాదన్నారు. బదిలీలు, పదోన్నతులు, రేషనలైజేషన్‌కు సంబంధించిన 16 రకాల డిమాండ్లతో పోరాటానికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈనెల 21న డీఈవో కార్యాలయం ముట్టడికి ఉపాధ్యాయులు తరలిరావాలని పిలుపునిచ్చారు. దీనిని పెద్ద ఎత్తున విజయవంతం చేసేలా జిల్లా స్థాయిలో స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. సభ్యులుగా వి.ఎస్.వేణుగోపాల్ (ఏపీహెచ్ఎంఏ), గోపీనాథ్ (పీఆర్‌టీయూ), ఇమంది పైడిరాజు (ఎస్టీయూ) టి.రామకృష్ణ (ఏపీటీఎఫ్ -257), జి.చిన్నబ్బాయి (యూటీఎఫ్), ఎ.అరుణ్ కుమార్ (ఏపీయూఎస్) ఎన్. ధనుంజయరావు (ఏపీటీఎఫ్-1938), బి.చిన్నారావు (ఏపీపీటీఏ) చొక్కాకుల సూర్యనారాయణ (వైఎస్సార్‌టీఏ) లను ఎన్నుకున్నారు. సోమవారం సాయంత్రం స్టీరింగ్ కమిటీ సమావేశమై డీఈవో కార్యాలయ ముట్టడికి సంబంధించిన కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు.

కూటమి ప్రభుత్వంపై ఇక పోరాటమే..

- జగన్ 2.ఓలో కార్యకర్తలకే ప్రాధాన్యం
- ప్రజా సమస్యలపై పోరాటలకు సిద్ధంకండి
- కూటమి నేతల దోపిడీకి విశాఖ అడ్డాగా మారింది
- జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ
- విశాఖ జిల్లా నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన కేకే రాజు

తీర్మానాలు

- ఈ నెలాఖరులోగా పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, డివిజన్ కమిటీలు ఏర్పాటుకావాలి.
- జూన్, జూలై నెలాఖరు నాటికి గ్రామ కమిటీలు పూర్తిచేయాలి.
- ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నాటికి బూత్ కమిటీలు ఏర్పాటు చేయాలి.
- 20 రోజులకు ఒకసారి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించాలి.
- వార్డు, జిల్లా స్థాయి ప్రజా సమస్యలపై పార్టీ తరపున పోరాడాలి.
- 19న జరిగే డిప్యూటీ మేయర్ ఎన్నిక వైఎస్సార్ సీపీ బహిష్కరణ.



మాట్లాడుతున్న శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, చిత్రంలో రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, విశాఖ పార్లమెంట్ పరిశీలకుడు కదిరి బాబూరావు, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, సమన్వయకర్తలు మజ్జి శ్రీనివాసరావు, దేవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు

సాక్షి, విశాఖపట్నం: ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వంపై పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ అన్నారు. శనివారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ముందుగా విశాఖ జిల్లా నూతన అధ్యక్షుడిగా కె.కె.రాజు, విశాఖ పార్లమెంట్ పరిశీలకుడిగా కదిరి బాబూరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రాష్ట్రంలో సంక్షేమం లేదు.. అభివృద్ధి లేదు అంతా శూన్యమే.. ఉన్నదల్లా రూ.1.5 లక్షల కోట్లు అప్పులు మాత్రమేనని ఎద్దేవా చేశారు. ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వమని, గిట్టుబాటు ధర లేక, ధాన్యం కొనుగోలు జరగక కళ్లాల్లోనే నిలిచిపోయిన పరిస్థితులు చూస్తున్నామన్నారు. మెట్ట ప్రాంతాల్లో గిట్టుబాటు ధర లేకపోవడంతో పొగాకు రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారం దాహంతో విర్రవీగుతున్న కూటమి ప్రభుత్వం బోల్తా పడకతప్పదని జోస్యం చెప్పారు. గతంలో రుషికొండ బోడిగుండు అంటూ పచ్చ పత్రికలు అదేపనిగా కథనాలు రాశాయి.. ఇప్పుడు ఈ ప్రాంతాన్ని అడ్డంగా దోచుకుంటుంటే ఎందుకు వార్తలు రాయడం లేదని ప్రశ్నించారు. న్యాయస్థానాలు మొట్టికాయలు వేసినా కూటమి ప్రభుత్వం తీరు మారడం లేదని మండిపడ్డారు. తమ ప్రభుత్వ హయాంలో హ్యూమన్ ట్రాకింగ్ జరిగిందని హడావుడి చేశారు.. మరి ఇప్పుడు ఎందుకు దృష్టి సారించలేదని ప్రశ్నించారు. జీవీఎంసీ కమిషనర్ లేకపోవడంతో నగర వీధుల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోతుందన్నారు. కమిషనర్‌ను నియమించుకోలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. పార్టీ నేతలు తమ ప్రాంతంలో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు.

పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు మాట్లాడుతూ జగనన్న 2.ఓలో కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. 20 రోజులకు ఒకసారి నియోజకవర్గ స్థాయి సమావేశం, ఆరు నెలలకు ఒకసారి జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించుకుందామన్నారు. రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏడాది అరాచక పాలన నా రాజకీయ చరిత్రలో ఎన్నడూ చూడలేదన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే అక్రమంగా కేసులు నమోదు పెడుతున్నారన్నారు. దేశంలో పరిస్థితులు చూస్తే ముందుగానే ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు కదిరి బాబూరావు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. అబద్ధపు హామీలతో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందన్నారు.

కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, సమన్వయకర్తలు మజ్జి శ్రీనివాసరావు, దేవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తైనాల విజయకుమార్, తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, డిప్యూటీ మేయర్ కె.సతీష్, ముఖ్యనేతలు రవిరెడ్డి, పార్టీ అనుబంధ విభాగ రాష్ట్ర అధ్యక్షులు బొల్లవరపు జాన్ వెస్లీ, పోతిన శ్రీనివాసరావు, పార్టీ నాయకులు కొండా రాజీవ్‌గాంధీ, రొంగలి జగన్నాథం, ఉడారవి, ఫరూఖీ, రవిరాజు, మొల్లి అప్పారావు, బాణాల శ్రీనివాసరావు, ఉరుకూటి అప్పారావు, గొలగాని శ్రీనివాస్, నడింపల్లి కృష్ణంరాజు, ద్రోణంరాజు శ్రీవాత్సవ, పి.వి.నారాయణ్, జియ్యాని శ్రీధర్, కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రాజు, అల్లు శంకర్‌రావు, అక్కరమాని పద్మ, దౌలపల్లి ఏడుకొండలు, కోరుకొండ వెంకటరత్న స్వాతి, నక్కిల లక్ష్మి, సాడి పద్మారెడ్డి, బిపిన్ కుమార్ జైన్, చెన్నా జానకిరామ్, గుండపు నాగేశ్వరరావు, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, శశికళ, పి.వి.సురేష్, బల్లా లక్ష్మణ్, గులివిందల లావణ్య, మహమ్మద్ ఇమ్రాన్, గుడివాడ సాయి అనుషా, ఉరుకూటి రామచంద్రరావు, కె.భూపతిరాజు సుజాత, జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి, పల్లా దుర్గారావు, దొడ్డి రామనాథ్, డా.మంచా నాగమల్లీశ్వరి, ఆల్ఫా కృష్ణ, షేక్ మహ్మద్ గౌస్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ఏపీఈపీడీసీఎల్ ఒప్పందం



ఒప్పందం పత్రాలను మార్చుకుంటున్న సీఎండీ పృథ్వీతేజ్, సీపీఆర్ అధ్యక్షుడు చొక్కాకుల శ్రీనివాస్

విశాఖ సిటీ: ఏపీఈపీడీసీఎల్ డేటా ఆధారిత నిర్ణయాలను బలోపేతం చేసుకునేందుకు సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్(సీపీఆర్)తో అవగాహన ఒప్పందం చేసుకుంది. శనివారం సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఆధ్వర్యంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం సీజీఎం పి.శ్రీనివాస్, సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్ అధ్యక్షుడు చొక్కాకుల శ్రీనివాస్ ఎంవోయూపై సంతకాలు చేశారు. ఢిల్లీకి చెందిన సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లోని కమర్షియల్ ట్యాక్స్, ఎక్సైజ్, మున్సిపల్ శాఖ వంటి అనేక శాఖలతో కలిసి పనిచేసిన అనుభవంతో ఇకపై ఏపీఈపీడీసీఎల్‌తో పనిచేయనుంది. విద్యుత్ పంపిణీ సామర్థ్యం, ఆదాయ వృద్ధే లక్ష్యంగా సీపీఆర్ సంస్థ ఏపీఈపీడీసీఎల్‌కు డేటా ఆధారిత విశ్లేషణలు చేయడంతో పాటు సంస్థ సిబ్బందికి అధ్యయనాలు, సూచనలు చేయనుంది. ఈపీడీసీఎల్‌లో ఏర్పాటు చేసిన డేటా అనలిటిక్ యూనిట్ (డీఏయూ)ను అభివృద్ధి పరచడం ద్వారా సంస్థ అంతర్గత వ్యవస్థ సామర్థ్యాలను పెంచడం, ఏపీఈపీడీసీఎల్ బిల్లింగ్ వ్యవస్థలోని రెవెన్యూ నష్టాలను తగ్గించడం, క్లిష్టమైన సమస్యలను పరిష్కరించడానికి డేటా విశ్లేషణలు, డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకోవడంలో సీపీఆర్ సహకరిస్తుంది.

సాంకేతిక ఆవిష్కరణలతోనే సుస్థిర భవిష్యత్తు

- హిందుస్థాన్ జింక్ సీఈవో అరుణ్ మిశ్రా
- ఘనంగా ఐఐపీఈ స్నాతకోత్సవం



మెడల్ అందుకుంటున్న విద్యార్థిని



ఐఐపీఈ స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ సీఈవో అరుణ్‌మిశ్రా

విశాఖ విద్య: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని సరికొత్త ఆవిష్కరణలతో ముందుకు సాగాలని హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ సీఈవో అరుణ్ మిశ్రా పిలుపునిచ్చారు. నగరంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) 5వ వార్షిక స్నాతకోత్సవం శనివారం నోవాటెల్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అరుణ్ మిశ్రా మాట్లాడుతూ విద్యార్థులు భిన్నంగా ఆలోచించాలన్నారు. చదువుకునే రోజుల్లోనే దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు. హిందుస్థాన్ జింక్ ఇన్నోవేషన్ జర్నీలోని ఉదాహరణలను వివరిస్తూ.. సుస్థిర ఇంధన భవిష్యత్తును రూపొందించడంలో కృత్రిమ మేధ, హైడ్రోజన్ వంటి సాంకేతిక పరిజ్ఞానాల పాత్రను తెలియజేశారు. ఐఐపీఈ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ పరితోష్ కె.బానిక్ మాట్లాడుతూ గ్రీన్ ఎనర్జీ పరివర్తన భారతదేశానికి అత్యంత ఆవశ్యకమని, ఈ దిశగా సుస్థిర ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో ఐఐపీఈ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. క్లిష్టమైన ఇంధన సవాళ్లను పరిష్కరించడానికి పరిశ్రమలు, ఇతర భాగస్వాములతో కలిసి పనిచేయాలని గ్రాడ్యుయేట్లకు సూచించారు.

రూ.150 కోట్లతో రీసెర్చ్ పార్కు

సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ మాట్లాడుతూ రూ.150 కోట్లతో ఐఐపీఈ-మాగ్నివియా బిజినెస్ అండ్ ఎనర్జీ రీసెర్చ్ పార్క్‌ను సబ్బవరంలోని సొంత క్యాంపస్‌లో త్వరలోనే ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఇది ఐఐపీఈ చరిత్రలో ఒక మైలురాయి అని పేర్కొన్నారు. సహజ హైడ్రోజన్‌పై భారతదేశపు మొట్టమొదటి అంతర్జాతీయ సదస్సును విజయవంతంగా నిర్వహించామని గుర్తు చేశారు. కెమ్ టెక్ ఫౌండేషన్ నుంచి ఎనర్జీ ఎక్సలెన్స్ అవార్డు-2025ను అందుకోవడంతో సంస్థ ప్రతిష్ట పెరిగిందన్నారు. 15 శాతం అంతర్జాతీయ ప్రాజెక్టులు, గ్లోబల్ ఎలెక్టివ్‌లతో అంతర్జాతీయ స్థాయిలో ఐఐపీఈ ముందంజలో ఉందన్నారు.

51 మందికి డిగ్రీలు ప్రదానం

స్నాతకోత్సవంలో మొత్తం 51 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఇందులో ఇద్దరికి పీహెచ్‌డీ, ఎమ్మెస్సీ అప్లైడ్ జియాలజీలో 15 మందికి, బీటెక్‌లో 34 మందికి(పెట్రోలియం ఇంజినీరింగ్-8, కెమికల్ ఇంజినీరింగ్-26) డిగ్రీలు అందించారు. ఈ సందర్భంగా పలువురు ప్రతిభావంతులైన విద్యార్థులకు బంగారు, వెండి పతకాలను ప్రదా నం చేశారు. ఆల్బర్ట్ ఇజాక్ మొహంతి (బీటెక్ కెమికల్ ఇంజనీరింగ్) అకడమిక్ ఎక్సలెన్స్, ఆల్ రౌండ్ ప్రతిభకు గాను ప్రతిష్ఠాత్మక ప్రెసిడెంట్ గోల్డ్ మెడల్ అందుకున్నారు. బీటెక్ కెమికల్ ఇంజినీరింగ్‌లో అహోల్జియా నందీష్ అమిత్‌కుమార్ (గోల్డ్), ఆయుష్ గుప్తా (వెండి), బీటెక్ పెట్రోలియం ఇంజనీరింగ్‌లో బిశ్వజిత్ పాటి (గోల్డ్), బోకం శ్రీరామ మణికంఠ గణేష్ (వెండి), ఎమ్మెస్సీ అప్లైడ్ జియాలజీలో డెబాసిస్ సాహు (గోల్డ్), సుజాత మార్ఖీ (వెండి) ప్రతిభ చూపారు. బాలికలను ప్రోత్సహించే ఉద్దేశంతో అందించే బెస్ట్ అవుట్ గోయింగ్ గర్ల్ స్టూడెంట్ మెడల్‌ను ఎమ్మెస్సీ అప్లైడ్ జియాలజీ విద్యార్థిని సుజాత మార్ఖీకి ప్రదానం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రామ్ ఫాల్ ద్వివేది, సెనేట్ సభ్యులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ సమ్మెకు జేఏసీ మద్దతు

- కేంద్రం ఆర్థిక ప్యాకేజీ ఇచ్చి.. బకాయిలకు జమ చేసుకుంది
- జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశంలో కీలక నిర్ణయాలు



రౌండ్ టేబుల్ సమావేశంలో ఐక్యత చాటుతున్న అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాలు

దాబాగార్డెన్స్: విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులు, నిర్వాసితుల సమస్యలపై అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ గళమెత్తింది. కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించుకోవడం కోసం ఈ నెల 20న శాశ్వత కార్మికులు, 20 నుంచి కాంట్రాక్టు కార్మికులు సమ్మె చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు నగరంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శనివారం జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌లోని వేలాది మంది కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తోందని.. పర్మినెంట్ ఉద్యోగులను వీఆర్ఎస్ పేరుతో ఇళ్లకు పంపిస్తోందని మండిపడ్డారు. రూ. 11,440 కోట్లు ఆర్థిక ప్యాకేజీ ప్రకటించినప్పటికీ, ఆ నిధులను కార్మికుల జీత భత్యాలకు, ప్లాంట్ అభివృద్ధికి వినియోగించకుండా ఆంక్షలు పెట్టిందన్నారు. రూ.9,654 కోట్లను కేంద్ర జీఎస్టీకి, బ్యాంకు బకాయిలకు జమ చేసుకుందని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తామని హామీలిచ్చి అత్యధిక మెజార్టీతో గెలిచిన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ శ్రీ భరత్ ఇప్పుడు నోరు మెదపడంలేదని మండిపడ్డారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోవడం కోసం కాంట్రాక్టు కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నిర్ణయించిందన్నారు. ఈ సమ్మెకు జేఏసీ సంపూర్ణ మద్దతు తెలుపుతోందన్నారు. ఈ నెల 18న నిర్వాసిత గ్రామాల్లో పాదయాత్రలు, బైక్ యాత్రలు, 19న ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల వద్ద నిరసనలు, 20న ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ప్రదర్శన, సభ నిర్వహించాలని జేఏసీ పిలుపునిచ్చింది. జేఏసీ చైర్మన్ ఎం.జగ్గునాయుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు, ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నాగభూషణం, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, సీఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు ఎ.కనకారావు, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆర్.అనిల్‌కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

చిట్టి తల్లి.. బుజ్జి కన్నా!

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో వన్యప్రాణుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇటీవల జూలో ఇండియన్ తోడేలు, బెంగాల్ నక్క, మడగాస్కర్ ప్రాంతానికి చెందిన లెమూర్ ఒక్కో పిల్లకు జన్మనిచ్చాయి. ఈ మూడు పిల్లలు జూ వైద్యులు, సిబ్బంది సంరక్షణలో ఆరోగ్యంగా ఉన్నాయని జూ క్యూరేటర్ జి.మంగమ్మ వెల్లడించారు. అంతరించిపోతున్న జాబితాలో ఉన్న తోడేళ్లు జూలో సంతానోత్పత్తి చేయడం శుభసూచికమని క్యూరేటర్ పేర్కొన్నారు. కాగా, ఇక్కడ సంతానోత్పత్తి చేసిన తోడేళ్లను 2019లో మైసూరు జూ పార్కు నుంచి, బెంగాల్ నక్కలను 2021లో ఢిల్లీ జూ నుంచి తీసుకువచ్చినట్లు ఆమె తెలిపారు. ఇక లెమూర్లను సుమారు పదేళ్ల కిందట ఇజ్రాయెల్ నుంచి తీసుకొచ్చామని వివరించారు. ప్రస్తుతం జూలో ఈ కొత్త పిల్లలతో కలిపి మొత్తం 8 ఇండియన్ తోడేళ్లు, 15 రింగ్‌టైల్డ్ లెమూర్స్, 4 బెంగాల్ నక్కలు ఉన్నాయని క్యూరేటర్ తెలిపారు.

వెంటాడిన విషాదం

ఆ కుటుంబానికి ఇది మొదటి విషాదం కాదు. గతంలో ఒక బిడ్డను గుండె జబ్బుతో కోల్పోతే, మరో బిడ్డను రోడ్డు ప్రమాదం రూపంలో విధి కబళించింది. ఇప్పుడు ఆ తల్లిదండ్రులు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. సబ్బవరం మండలం చిన్నపాలెం సమీపంలో అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదం ఆ నిరుపేద కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసింది.

- జాతీయ రహదారిపై మృత్యు ఘోష
- కుమారుడిని కబళించిన మృత్యువు
- చావుబతుకుల మధ్య తల్లిదండ్రులు
- గతంలో మరో బిడ్డ వ్యాధితో మృతి



బోలారోను ఢీకొట్టిన ద్విచక్రవాహనం



మనోజ్ మృతదేహం

సబ్బవరం: నాతవరం మండలం నాయుడుపాలెం గ్రామానికి చెందిన నక్కా అప్పలస్వామి, పద్మ దంపతులు ఆనందపురం మండలం గిడిజాల సమీపంలోని నీళ్లకుండీల వద్ద ఓ సిమెంట్ ఇటుక బట్టీలో పనిచేస్తున్నారు. స్వగ్రామంలో జరిగిన బోడకొండమ్మ పండగలో పాల్గొని, తిరిగి పనికి వెళ్లడానికి తమ తొమ్మిదేళ్ల కుమారుడు మనోజ్‌తో కలిసి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. చిన్నారి మనోజ్ భవిష్యత్‌పై ఎన్నో ఆశలు పదిలపరుచుకున్న ఆ తల్లిదండ్రులు.. కుమారుడితో కబుర్లు చెప్పుకుంటూ ముందుకు సాగుతున్నారు. అయితే ఆ ప్రయాణం తమ బిడ్డకు చివరి ఘడియ అని వారికి తెలియదు. జాతీయ రహదారిపై చిన్నపాలెం సమీపంలో నిలిచి ఉన్న కోళ్లను తరలించే బొలెరో వాహనాన్ని వారి ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఆ క్షణం ఆ కుటుంబ కల చెదిరిపోయింది. ప్రమాద తీవ్రతకు మనోజ్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. అప్పలస్వామి, పద్మ తీవ్ర గాయాలతో హాహాకారాలు చేశారు. వారిని హుటాహుటిన 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. వారి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కుటుంబంలో ఇది రెండో విషాదం. అంతకుముందు వారి చిన్న కుమారుడు శర్వాన్ సత్యనారాయణ గుండె సంబంధిత వ్యాధితో మరణించాడు. ఒక బిడ్డను వ్యాధితో పోగొట్టుకున్న ఆ తల్లిదండ్రులు, ఇప్పుడు పెద్ద కొడుకును కూడా రోడ్డు ప్రమాదంలో కోల్పోయారు. మనోజ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. మనోజ్ పెదనాన్న అప్పలకొండ ఫిర్యాదు మేరకు ఎస్ఐ సింహాచలం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కాగా.. ఆ తండ్రికి తన కుమారుడు మరణించాడన్న విషయం తెలియదు. చెవి నుంచి రక్తం కారుతున్నా.. తన కొడుకు ఎలా ఉన్నాడని, వాడిని ఎలాగైనా బతికించండని వేడుకున్న వైనం కుటుంబ సభ్యుల కంట కన్నీరు పెట్టించింది.

త్వరితగతిన అభివృద్ధి పనులు చేపట్టాలి

మహారాణిపేట: కార్యాచరణకు అనుగుణంగా అభివృద్ధి పనులు త్వరితగతిన చేపట్టాలని వివిధ విభాగాల అధికారులను కలెక్టర్ ఎం.ఎస్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. ఇటీవల జరిగిన డీఆర్సీ, దిశా సమావేశాల్లో చర్చించిన అంశాలపై కలెక్టరేట్‌లో శనివారం వివిధ విభాగాల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన అంశాలపై ఆయా శాఖల ఆధ్వర్యంలో సమీక్షించుకోవాలని, సమస్యలకు త్వరితగిన పరిష్కారాలు చూపాలని సూచించారు. ప్రాథమిక, ద్వితీయ, సేవా రంగాల్లో ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రస్తావించిన అంశాలపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. మౌలిక వసతుల కల్పన, ఉద్యోగ నైపుణ్య శిక్షణ, సేవల విస్తృతిపై ప్రధానంగా దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఆయా శాఖల పరిధిలో ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, సాధించిన ప్రగతి గురించి అడిగి తెలుసుకున్నారు. డీఆర్సీ, దిశా సమావేశాలకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ రిపోర్టులను వారం రోజుల్లో అందజేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, ఆర్డీవోలు, పి.శ్రీలేఖ, సంగీత మాధూర్, ఎస్‌డీసీలు, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఉచిత నైపుణ్య శిక్షణకు దరఖాస్తులు

మద్దిలపాలెం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో నైపుణ్య శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ చాముండేశ్వరరావు తెలిపారు. స్కిల్ హబ్–డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వం డిగ్రీ కాలేజీలో జరిగే శిక్షణా కార్యక్రమానికి 18 నుంచి 40 ఏళ్లలోపు ఉన్న పది, ఇంటర్, డిప్లమో, డిగ్రీ, బీటెక్ విద్యార్హతలు గల వారు అర్హులని వెల్లడించారు. ఈ కోర్సులో మూడు నెలలు ఉచితంగా సర్టిఫికెట్ ఆధారిత శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9885694676లో సంప్రదించాలని సూచించారు.

కూటమిలో సందిగ్ధత

డిప్యూటీ మేయర్‌పై రాని స్పష్టత

డాబాగార్డెన్స్: జీవీఎంసీ డిప్యూటీ మేయర్ ఎన్నికకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 19న ప్రత్యేక సమావేశం నిర్వహణపై జాయింట్ కలెక్టర్, ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి మయూర్ అశోక్ ఇప్పటికే అధికారులకు మార్గనిర్దేశం చేశారు. అయితే డిప్యూటీ మేయర్ పదవి ఏ పార్టీకి దక్కుతుందనే దానిపై కూటమిలో శనివారం సాయంత్రం వరకు ఓ స్పష్టత రాలేదు. దీంతో ఇరు పార్టీల శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. జీవీఎంసీ మేయర్ పదవి టీడీపీకి దక్కడంలో జనసేన సహకారం ఉందని.. కాబట్టి డిప్యూటీ మేయర్ పదవి తమకే కేటాయించాలని జనసేన కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్ బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ గట్టిగా పట్టుబడుతున్నారు. మరోవైపు డిప్యూటీ మేయర్ టీడీపీకే చెందాలని ఆ పార్టీ శ్రేణులు వాదిస్తున్నాయి.

తెలుగుదేశం నుంచి డిప్యూటీ మేయర్ పదవికి ప్రధానంగా ముగ్గురి పేర్లు వినిపిస్తున్నాయి. మేయర్ పీలా శ్రీనివాసరావు గాజువాక నియోజకవర్గానికి చెందిన 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాస్‌కు మద్దతు తెలుపుతూ అధిష్టానానికి లేఖ పంపినట్లు సమాచారం. సీనియర్ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు యాదవ సామాజిక వర్గానికి చెందిన మంగవేణి పేరును ప్రతిపాదించగా, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సైతం యాదవ సామాజిక వర్గానికి చెందిన హేమలత పేరును తెరపైకి తీసుకొచ్చారు.

జనసేనలో అందరూ అభ్యర్థులే.!

జనసేనలో డిప్యూటీ మేయర్ పదవిపై ఆశావహులు అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీ నుంచి గెలిచిన వారు, ఇంకో పార్టీ నుంచి వచ్చి కండువా కప్పుకున్న వారు ఈ పదవిని ఆశిస్తున్నారు. పార్టీ కీలక నేతలతో భేటీ అవుతూ తమ పేర్లను ప్రతిపాదించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ తనకు డిప్యూటీ మేయర్ పదవిపై ఆశ లేదని, జనసేనకు చెందిన వారికే ఈ పదవిని కేటాయించాలని కోరుతూ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు లేఖ పంపారు. మరోవైపు తెరచాటున మేయర్ పీలా శ్రీనివాస్, టీడీపీ నుంచి డిప్యూటీ మేయర్ ఆశిస్తున్న గంధం శ్రీనివాసరావుతో భేటీ కావడంపై పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

పచ్చదనం పెంపుపై దృష్టి

నగర ప్రజలకు మేయర్ పిలుపు



వాహనాలను ప్రారంభిస్తున్న మేయర్, కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

ఎంవీపీకాలనీ: నగర ప్రజలు పచ్చదనం పెంపుపై దృష్టిసారించాలని మేయర్ పీలా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శివాజీ పార్కులోని యోగా సాధన సెంటర్ వేదికగా శనివారం 'బీట్ ద హీట్' నినాదంతో స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో పర్యావరణ పరిరక్షణకు అన్ని వార్డుల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వార్డుల్లోని ఖాళీ ప్రదేశాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, టెర్రస్ గార్డెన్‌లు అభివృద్ధి చేయాలని సూచించారు. నీటి వృథాను అరికట్టడంతో పాటు ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు ఉండాలని స్పష్టం చేశారు. కలెక్టర్ ఎం.ఎస్.హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ వేసవి ఉపశమనం కోసం నగరంలో గ్రీన్ షేడ్స్, 106 చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్లోబల్ వార్మింగ్ తగ్గించేందుకు భవనాలపై సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, విశాఖ జిల్లా ప్రత్యేక అధికారి ఎస్.ఢిల్లీరావు, కార్పొరేటర్లతో కలిసి మేయర్, కలెక్టర్ బీట్ ద హీట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. పార్కులో మొక్కలు నాటారు. తొలుత కేంద్ర సబ్సిడీ నిధులు రూ.1.5 కోట్లతో కొనుగోలు చేసిన ఆరు వాహనాలను మేయర్, కలెక్టర్ ప్రారంభించారు. ఎస్జీవోల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టెర్రస్ గార్డెన్ నమూనా, వరి కంకులు, వాటర్ బౌల్స్, చిరుధాన్యాల స్టాళ్లను పరిశీలించి.. నిర్వాహకులను అభినందించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, ప్రధాన ఇంజినీర్ శివప్రసాద్ రాజు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, జోనల్ కమిషనర్లు శివప్రసాద్, కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

అఖిల భారత సమ్మె జూలై 9కి వాయిదా

డాబాగార్డెన్స్: అఖిల భారత సార్వత్రిక సమ్మె ఈ నెల 20 నుంచి జూలై 9కి వాయిదా పడిందని అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. దేశ సరిహద్దుల్లో ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. జగదాంబ జంక్షన్ సమీపంలోని సిటు కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ ఆపాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో ఈ సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. సమ్మె వాయిదా పడిన నేపథ్యంలో.. ఈ నెల 20న పని ప్రదేశాలు, ఫ్యాక్టరీ గేట్ల వద్ద కార్మికులు నిరసనలు తెలియజేయాలని కోరారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి జీవీఎంసీ వరకు జరిగే నిరసన ప్రదర్శనలో పెద్ద ఎత్తున పాల్గొనాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

సండే క్లాసిఫైడ్స్ సాక్షి

స్కేట్ బోర్డ్ పార్క్ నిర్మాణానికి అడుగులు

నేషనల్, ఆసియన్ స్కేటింగ్‌కు సన్నాహాలు

విశాఖ స్పోర్ట్స్: ఆసియన్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌ను 2027లో విశాఖ వేదికగా నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా తొలుత ఇక్కడే నేషనల్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌ను 2026లో నిర్వహించనున్నారు. స్పీడ్, రోడ్, ఆర్టిస్టిక్, రోలర్ హాకీ, ఇన్‌లైన్ హాకీ తదితర 11 అంశాల్లో ఈ చాంపియన్‌షిప్‌లు జరుగుతాయి. బాంకెడ్ ట్రాక్ రింక్‌లో స్పీడ్ పోటీలు జరగనుండగా ఆర్టిస్టిక్ పోటీల్లో విన్యాసాల మేళవింపుతో పోటీలుంటాయి. ఈ పోటీలకు అనువుగా విశాఖలో వసతులున్నా స్కేట్‌బోర్డ్ ఈవెంట్‌కు తగిన వసతులు లేవు. స్కేట్‌బోర్డ్ ఈవెంట్‌లో స్ట్రీట్, పార్క్ అంశాల్లో పోటీలు నిర్వహిస్తారు. గతంలో వీఎంఆర్‌డీఏ పార్క్‌లోనే చెక్కలతో నిర్మించిన తాత్కాలిక సౌకర్యం కల్పించినా... సిమెంట్‌తో కూడిన నిర్మాణానికి రూపకల్పన జరుగుతుంది. దీనిలో భాగంగానే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన స్కేట్ బోర్డ్ పార్క్ నిర్మాణానికి ప్రణాళిక చేస్తున్నట్లు వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్, ఎమ్మెల్యే గణబాబు తెలిపారు. ఈ సందర్భంగా వారు వీఎంఆర్‌డీఏ పార్క్‌లో ఉన్న స్కేటింగ్ మౌలిక సదుపాయాలను పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. వచ్చే ఏడాది జరగనున్న జాతీయ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌కు అన్ని సదుపాయాలతో రింక్‌ల నిర్మాణం జరుగుతుందన్నారు. పోటీలకు వచ్చే స్కేటర్లకు సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ పర్యటనలో ప్రధాన ఇంజనీర్ వినయ్‌కుమార్, పర్యవేక్ష ఇంజనీర్ భవానీశంకర్, డీఎఫ్‌వో సుజాత, కార్యనిర్వాహిక ఇంజనీర్ రామరాజు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న టూరిస్ట్ బస్సు

- విశాఖకు చెందిన ఏడుగురు యాత్రికులకు గాయాలు
- అదే సమయంలో ప్రమాదానికి గురైన మరో లారీ
- క్యాబిన్‌లో చిక్కుకుని సబ్బవరానికి చెందిన డ్రైవర్ దుర్మరణం

శ్రీకాకుళం రూరల్: జాతీయ రహదారిపై శనివారం వేకువజామున హాహాకారాలు మిన్నంటాయి. ఏం జరుగుతుందో తెలియక ప్రయాణికులు, అటువైపుగా వెళ్తున్న వాహనచోదకులు భీతిల్లిపోయారు. తొలుత టూరిస్ట్ బస్సు ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టగా.. కొద్దిసేపటి తర్వాత అదేచోట ఆగి ఉన్న లారీలను మరో గ్రానైట్ లారీ ఢీకొట్టింది. నిమిషాల వ్యవధిలో జరిగిన ఈ ఘటనల్లో ఓ డ్రైవర్ మృతి చెందగా, ఏడుగురు యాత్రికులు గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని సింగుపురం కస్తూర్బా బాలికా విద్యాలయం సమీపంలో శనివారం ఉదయం 5 గంటల ప్రాంతంలో విశాఖపట్నం నుంచి బరంపురం వెళ్తున్న కంభమేశ్వరి ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఎదురుగా వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఆ సమయంలో బస్సులో 35 మంది ప్రయాణికులు ఉండగా.. ఏడుగురు గాయపడ్డారు. డ్రైవర్ నిద్రమత్తే ఈ ఘటనకు కారణమని తెలుస్తోంది. ఘటనా స్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది బస్సులో నుంచి క్షతగాత్రులను బయటకు తీశారు. ఆ సమయంలో ట్రాఫిక్ స్తంభించింది. ఇదే రహదారిలో వరుసగా నాలుగు లారీలు నిలిచిపోయాయి. ఆ సమయంలో రాయికాంతం నుంచి కోటబొమ్మాళికి గ్రానైట్ రాళ్లతో వస్తున్న లారీ డ్రైవర్ ముందు ఆగి ఉన్న లారీలను గమనించక అతివేగంతో ఢీకొట్టాడు. ఈ ఘటనలో గ్రానైట్ రాళ్లు క్యాబిన్ వైపునకు దూసుకురావడంతో అందులో చిక్కుకుని డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిది విశాఖ జిల్లా సబ్బవరం గ్రామానికి చెందిన రాపర్తి నూకరాజు(38)గా గుర్తించారు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.